సింగిల్ పేజీ కథ

# ముసలయ్య

## ఎల్.ఆర్.స్వామి

నులకమంచం మీద నుంచి, ఒక ఉదుటున లేచాడు, ముసలయ్య. ఎలుకని చూసిన పిల్లికళ్ళలా మెరిసాయి, అతని కళ్ళు. ఒకేసారి నాలుగు సారా పాకెట్లు తాగినంత ఆనందం కలిగింది. నోటిలోని చుట్టముక్క తీసి నుసి దులుపుతూ అడిగాడు.

"అయితే ఎందరుంటారే..."

"ఏమో... నాకేం ఎరుకా? నాను వెళ్ళి సూసినానా ఏంటి?" అతని పెళ్ళాం కోపంగా అంది.

"మనోళ్ళందరూ ఎల్లినారు. నువ్వే ఇలా తొంగున్నావు. ఏం మడిసో..."

"అలా అనేసినావేంటి...?"

"అననా మరి! మనోళ్ళు జాగా కాడకి ఎల్తున్నారన్నా తొంగుండావు. తిండిగింజలు లేవన్నా తొంగుడావు... నేనేటి సెప్పేది...?"

మంచం మీద నుంచి చిరిగిన తువ్వాలు తీసి దులిపి భుజం మీద వేసుకున్నాడు ముసలయ్య.

"ఏంటేంటీ? నీవూ ఎల్తావా? జాగా కాడకే! ఒళ్ళు వొంగనివాడివి... పాక వెయ్యవచ్చునంటే ఉషారు వచ్చేసినాదా, ఏంటి?"

ముసలయ్య మాట్లాడలేదు. చుట్ట ముట్టించుకొని ముందుకు నడిచాడు.

ప్రపంచానికి అప్పుడే కొత్త వెలుగుని, ఆశని అందించిన సూర్యకిరణాలు అతన్ని వెచ్చగా తాకాయి.

అతని పాక దగ్గరే పాకలలో వుంటూ కూలిపని చేసి రోజులు ఈడ్చేవాళ్ళు సొంత పాక వేసుకోవటం కోసం భూమి స్వాధీనం చేసుకుంటున్నారని, పెళ్ళాం చెప్పగా విన్నాడు, ముసలయ్య. అతడు వాళ్ళతో కలసి వెళ్ళినందుకు తిట్టింది కూడా. ఒకసారి పాకవేసి కాపురముంటె పట్టాలు తరువాత సంపాదించవచ్చట! సొంత ఇల్లు గురించి కల కననివారెవరుంటారు!

చురుకుగా నడిచి అక్కడకి చేరుకున్నాడు. వందకి పైనే వున్నారు జనం. చీరలతోనూ, తాడుతోనూ జాగాలకు సరిహద్దులు నిర్మించుకున్నారు. కొందరు "వారి జాగాల"లోని ముళ్ళపొదలు తొలగిస్తున్నారు కొందరు బండరాళ్ళు తిరగతోస్తున్నారు. మరికొందరు పాక వెయ్యటం గురించి మాట్లాడుకుంటున్నారు. చాలా హడావిడిగా కనబడింది ఆ ప్రాంతం!

"ఒరేయి, ముసలయ్యగాడు వచ్చాడురా" ముసలయ్యని చూసి తవిటయ్య అడిగాడు. "తాళ్ళు తెచ్చావురా బావా! నీకూ చోటు చూపించమంటావా...?"

ముసలయ్య బదులు పలకలేదు. చుట్టూ ఒకసారి చూసాడు. ఒక నిమిషం పోయాక అడిగాడు "ఒరేయి, నాకు ఒక అనుమానం..."

"ఏంటిరా బావా...?"

"జాగా స్వాధీనం చేసుకుంటున్నాం, సరే. కాని ఏ జాగా ఎవరిదని ఎలా తెలుస్తుందిరా?"

"అందుకే తాడు కడుతున్నాం...!"

"కడుతున్నారులే. ఎవరైనా తాడు జరుపుతే..."

"ఎవరు జరుపుతారు బావా? అంతా మనోళ్ళే కదా?"

"అవునవును. అయినా..." ముసలయ్య ఒక నిమిషం ఆగి అటూ ఇటూ చూసాడు. ఆ తరువాత అన్నాడు "అదిగో ఆ చివర తాడు కట్టేది మన ప్రకాశం కదూ..."



ముసలయ్య బదులు పలకలేదు. చుట్టూ ఒకసారి చూసాడు. ఒక నిమిషం పోయాక అడిగాడు "ఒరేయి, నాకు ఒక అనుమానం..."
"ఏంటిరా బావా...?"
"జాగా స్వాధీనం చేసుకుంటున్నాం, సరే. కాని ఏ జాగా ఎవరిదని ఎలా తెలుస్తుందిరా?"
"అందుకే తాడు కడుతున్నాం...!"

"అవును..."

"వాడు మొన్న ఏం చేసాడో, తెలుసా? గొలుసు కరిగించి చేస్తానని చెప్పి పెళ్ళాం గొలుసు తీసుకొని వెళ్ళి బేడెత్తు బంగారం నొక్కేసేడట.. వాడి పెళ్ళాం మా ఆవిడతో చెప్పి ఏడ్చింది పాపం! తప్పు కదా!"

ఆలోచనలో పడ్డాడు, తవిటయ్య.

"మనం పనిలోకి పోతాం కదురా, పగలంతేదుంటం?" ముసలయ్య అన్నాడు. "అందుకే మనం ఒకటి చెయ్యాల".

"ఏంటది...?"

"సరిహద్దులలో పెయింటుతో పేరు వ్రాస్తే సరే అలా ఉండిపోతది".

ఆ ఆలోచన వచ్చింది, తవిటయ్యకి- మిగతా వారికి కూడా- పని, వెంటనే, ముసలయ్య చెయ్యిస్తానని అన్నాడు. కాని డబ్బు దగ్గరే కొంత పేచి వచ్చింది ఒక పేరు వ్రాయించటానికి, యాభై రూపాయలు అడిగాడు. తర్జనా, మర్జనా జరిగింది. యాభై ఎక్కువ అన్నాడు, ఒకడు. రోజు తాగే డబ్బుకన్నా తక్కువే కదరా అన్నాడు, మరొక్కడు.

"ముసలయ్య మనవాడు కనుక తక్కువకు వ్రాయిస్తున్నాడు రా" అన్నాడు మూడోవాడు. చివరికి, అందరూ ఒప్పుకున్నారు.

ముసలయ్య జేబు డబ్బుతో నిండింది.

మరునాడు, ప్రపంచాన్ని, చీకటి మింగే వేళలో, కూలిపని ముగించుకొని, జాగా వద్దకు వచ్చినవారికి సరిహద్దులుగా కట్టిన తాళ్ళు, చీరలు కనబడలేదు. చుట్టూ కంచ కట్టం వల్ల- జాగాలోకి అడుగు పెట్టలేకపోయారు. ముసలయ్య వ్రాయించిన పేరులు మాత్రం వారిని చూసి వెటకారంగా నవ్వాయి. అప్పుడు,

చీకటి పొరలని తప్పించుకొని చొచ్చుకు వచ్చిన వెన్నెలలో తడుస్తూ, మందు, మాంసం ఆస్వాదిస్తూ ఆనందించాడు, ముసలయ్య, మరో పది రోజులు పనిలోకి వెళ్ళకపోయినా, మందుకి, మాంసానికి లోటు వుండదనేది, అతని ఆనందానికి కారణం.